




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
జనవరి 20, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## చిరస్థాయిగా
# మేడారం మహాజాతర

**రూ.101 కోట్లతో గద్దెల ఆధునికీకరణ.. జాతర ప్రాంగణానికి సమగ్ర మౌలిక వసతులు**

**పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి.. కుటుంబ సమేతంగా వనదేవతలకు మొక్కులు**

**మనవడితో కలిసి సీఎం తులాభారం.. భవిష్యత్ తరాలకు ఆదివాసీ సంప్రదాయాల పరిరక్షణ**

వరంగల్, జనవరి 19 : మేడారం మహా జాతర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా గద్దెలను ఆధునికీకరించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న ఆదివాసీ సంప్రదాయాలు, వనదేవతల ఆచారాలు భవిష్యత్ తరాలకు స్పష్టంగా తెలియాలనే ఉద్దేశంతో జాతర ప్రాంగణాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇంతటి గొప్ప కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం తనకు దైవానుగ్రహమేనని సీఎం వ్యాఖ్యానించారు. మేడారం మహా జాతరకు సంబంధించి రూ.101 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల పైలాన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ అభివృద్ధి పనుల్లో గద్దెల ఆధునికీకరణ, ప్రాకారం నిర్మాణం, ఫ్లోరింగ్, అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ, క్రౌడ్ లైటింగ్, వాచ్‌టవర్, తొమ్మిది స్వాగత ద్వారాల ఏర్పాటు ఉన్నాయి. అలాగే హరిత హోటల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సీసీ రోడ్డు, గద్దెల నుంచి జంపన్నవాగు వరకు రహదారి విస్తరణ, కూడళ్ల అభివృద్ధి పనులను చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి

(మిగతా 2వ పేజీలో)

## హరీశ్‌రావుకు
# సిట్ నోటీసు

**ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని ఆదేశం**

**సీఆర్పీసీ సెక్షన్ 160 కింద అందజేత**

**మంగళవారం ఉదయం 11 గంటలకు రావాలంటూ సోమవారం రాత్రి నోటీసు**

**నార్సింగ్ నివాసంలో సిబ్బందికి అందజేత**

**సిద్దిపేట పర్యటనలో ఉన్న మాజీ మంత్రి**

**హరీశ్‌కు నోటీసు ఇదే తొలిసారి**



హైదరాబాద్, జనవరి 19 : ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం చోటుచేసుకుంది. మాజీ మంత్రి హరీశ్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మంగళవారమే (నేడు) జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద నోటీసు ఇచ్చింది. మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారుల ఎదుట హాజరు కావాలని అందులో పేర్కొంది. జూబ్లీహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరి ఈ నోటీసులను జారీ చేశారు. 2024 మార్చి పదో తేదీన నమోదైన కేసు క్రైం నంబరు 243/2024 ఐపీసీ సెక్షన్ 166, 409, 427, 201, 120(బీ) రెడ్‌విత్ 34.3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ 1984 సెక్షన్ 65, 66, 66(ఎఫ్)(1)(బీ)(2) అండ్ 70 ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ కింద పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు తదుపరి విచారణలో భాగంగా ఈ నోటీసులు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొన్ని వాస్తవాలు, ఘటనలపై మీకు అవగాహన ఉందని దర్యాప్తులో తెలిసిందని, దానిపై విచారించాల్సి ఉందని, మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. నిజానికి, హరీశ్ రావు తన సొంత నియోజకవర్గం సిద్దిపేట పర్యటనలో ఉండగా.. నార్సింగిలోని ఆయన నివాసానికి అధికారులు చేరుకున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా ఎవరూ లేరు. దాంతో, నోటీసు కాపీని సిబ్బందికి అందజేశారు. కాగా, రాజకీయంగా

(మిగతా 2వ పేజీలో)



# 'నైని' నుంచి దృష్టి మళ్లించేందుకే డ్రామాలు

**బామ్మర్ది సృజన్‌రెడ్డి సామ్ బయటపడటంతో వణుకు**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్**

**సుప్రీంకోర్టు కొట్టేసిన కేసుతో మళ్లీ కొత్త డ్రామా**

**మాజీమంత్రి హరీశ్‌రావుపై కావాలనే కక్ష సాధింపు**

**భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, జనవరి19 : రాజకీయంగా ఎదుర్కోలేక, పాతకేసులతో ఇబ్బందిపెట్టాలని చూస్తున్న రేవంత్‌రెడ్డిని ఎట్టిపరిస్థితుల్లో వదలబోమని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల కోసం ఎంతదూరమైనా వెళ్తామని

(మిగతా 2వ పేజీలో)

# 2,500 మందితో వందేమాతరం ప్రదర్శన

**కీరవాణిని అభినందించిన బండి సంజయ్**


**వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రిపబ్లిక్ డే పరేడ్ ప్రత్యేక ప్రదర్శన**

**సంగీతం అందిస్తున్న ఎం.ఎం. కీరవాణి**

**దేశవ్యాప్తంగా 2500 మంది కళాకారులతో భారీ కార్యక్రమం**


**కీరవాణి కృషిని కొనియాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహణ**



హైదరాబాద్, జనవరి 19 : ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కీరవాణి స్వరాలు సమకూర్చడం ఒక చరిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. వందేమాతరం గీతం

(మిగతా 2వ పేజీలో)



# తెలంగాణ స్పీకర్‌కు సుప్రీం నోటీసులు

**ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో కీలక మలుపు**

**కోర్టు ధిక్కారంపై పిటిషన్ దాఖలు**

**స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం**

**కేటీఆర్ పిటిషన్‌తో కలిపి విచారణ**

**2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలన్న ఆదేశం**

**తదుపరి విచారణ ఫిబ్రవరి 6కు వాయిదా**

న్యూఢిల్లీ, జనవరి 19 : బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అనర్హత కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో స్పీకర్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు

(మిగతా 2వ పేజీలో)





# కీ.శే కల్లెట్ల బిక్షపతి సగర దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన బంధుమిత్రులు

**హాజరైన పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, సగర సంఘం నాయకులు**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఆయుర్వేదిక్ యునానిక్ క్లినిక్ లో స్వీపర్ గా పనిచేసిన ఇటీవల మరణించిన కీ.శే కల్లెట్ల బిక్షపతి సగర దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి, యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు సికిలమెట్ల శ్రీహరి, మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, రాచకొండ రవీంద్ర చారి, పాశం కృష్ణ యాదవ్, పాశం రాము, సగర సంఘం నాయకులు గొల్లూరి రాములు సాగర, సూధం శేఖర్ సాగర్, ప్రముఖ న్యాయవాది ఆలేటి యాదగిరి సాగర్, వద్దేపల్లి రాములు సాగర్, రసాల వెంకటేష్ సాగర్, బిక్షపతి, బాకారం వెంకటేష్ జంగయ్య సాగర్, లక్ష్మణ్ సాగర్, కల్లెట్ల నర్సింగ్ సాగర్ మిత్రులు తండ నరసింహ గౌడ్, సురపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సిపిఐ నాయకులు బచ్చలగోని గాలయ్య యాదవ్, రమేష్ ,ఏలే భాస్కర్, అక్కనపల్లి వీరయ్య, బిజెపి నాయకులు సంగిశెట్టి లక్ష్మీనారాయణ, రాసాల యాదయ్య సాగర్, గొల్లూరి శివ, గొల్లూరి యాదగిరి సాగర్, పాండు సాగర్, శివకుమార్ సాగర్, శ్రీను సాగర్ తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు

# హీరో విజయ్‌ని మరోసారి విచారించిన సీబీఐ

**కరూర్ తొక్కిసలాట కేసులో నటుడు విజయ్ విచారణ పూర్తి**

**ఢిల్లీలో రెండోసారి 5 గంటలకు పైగా ప్రశ్నించిన సీబీఐ**

**విజయ్‌పై పలు కీలక ప్రశ్నలు సంధించిన అధికారులు**

**ఫిబ్రవరిలో చార్జిషీట్ దాఖలుకు సీబీఐ సన్నాహాలు**



తమిళనాడు వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్‌ను కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ రెండోసారి విచారించింది. సోమవారం ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో ఈ విచారణ దాదాపు ఐదున్నర గంటల పాటు సాగింది. ఈ కేసు దర్యాప్తులో ఇది కీలక దశగా భావిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన రాజకీయ ర్యాలీలో భారీగా జనం తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘోర దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవడంతో, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో సంబంధం ఉన్న వారిని ఢిల్లీకి పిలిపించి సీబీఐ అధికారులు విచారిస్తున్నారు. జనవరి 12న మొదటిసారి విజయ్‌ను ఆరు గంటల పాటు ప్రశ్నించారు. విచారణ సందర్భంగా, "ర్యాలీలో ట్రాఫిక్ రద్దీని గమనించారా? జనాన్ని నియంత్రించడంలో ఏడు గంటల ఆలస్యం ఎందుకు జరిగింది? రద్దీ ఉన్నప్పటికీ కాన్వాయ్‌ను ఎందుకు ముందుకు పోనిచ్చారు?" వంటి పలు కీలక ప్రశ్నలను అధికారులు విజయ్ ముందు ఉంచినట్లు సమాచారం. కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానమివ్వగా, మరికొన్నింటికి పత్రాలు చూసి చెబుతానని, సమయం కావాలని కోరినట్లు తెలిసింది. విచారణ ముగిశాక, విజయ్‌కు మళ్లీ ఎలాంటి సమన్లు జారీ చేయలేదని టీవీకే పార్టీ అడ్మినిస్ట్రేటర్ నిర్మల్ కుమార్ స్పష్టం చేశారు. విజయ్‌ను అరెస్టు చేస్తారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని, దర్యాప్తునకు తాము పూర్తిగా సహకరిస్తామని ఆయన తెలిపారు. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఫిబ్రవరి రెండో వారంలోగా ఈ కేసు చార్జిషీట్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేయడానికి సీబీఐ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# హిందువులపై దాడులు.. స్పందించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

**వాటిలో మతపరమైన ఉద్దేశాలు లేవంటూ ప్రకటన**

**చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగినవారు చేసినవేనన్న బంగ్లాదేశ్**

**645 ఘఘటనల్లో 71 మతపరమైనవని వెల్లడి**

**50 ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడి**




తమ దేశంలో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. తమ దేశంలో మైనారిటీలకు సంబంధించిన ఘటనల్లో చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగిన వ్యక్తులు చేసినవేనని, వాటిలో మతపరమైన ఉద్దేశాలు లేవని తెలిపింది. మైనారిటీలకు సంబంధించి గత ఏడాది 645 ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆ దేశ తాత్కాలిక ప్రధాని మహమ్మద్ యూనస్ కార్యాలయం వివరాలు వెల్లడించింది. వాటిలో 71 ఘటనల్లో మతపరమైన కోణాలు ఉన్నట్లు పేర్కొంది. ఆలయాలపై దాడులకు సంబంధించి 38 ఘటనలు నమోదైనట్లు తెలిపింది. ఆ 71 ఘటనలకు సంబంధించి 50 అంశాల్లో పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించింది. మిగిలిన 21 ఘటనలపై తగిన చర్యలు తీసుకున్నామని పేర్కొంది. నేరం ఏదైనా తీవ్రంగానే పరిగణిస్తున్నామని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. మరోవైపు, ఈ ప్రకటనను బంగ్లాదేశ్ హిందూ, బుద్ధిస్ట్, క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ప్రకటనలు నేరస్థులను ప్రోత్సహించి, వారికి శిక్షపడదనే భావనను కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. గత మూడు వారాల వ్యవధిలోనే 10 మందికి పైగా హిందువులు బంగ్లాదేశ్‌లో హత్యకు గురయ్యారు. దీంతో అక్కడి హిందువులు, ఇతర మైనారిటీల భద్రతపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ దాడులపై చర్యలు తీసుకోవాలని బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తెచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

## హరీశ్‌రావుకు సిట్ నోటీసు

తీవ్ర దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తొలిసారిగా బీఆర్ఎస్ కీలక నేతకు నోటీసులు జారీ చేయడం.. ఇప్పుడు ఏకంగా ఆయనను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు సిట్ సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు ప్రస్తుత, మాజీ అధికారులు, రాజకీయ నాయకుల్ని విచారించిన సిట్.. విచారణలో లభించిన సమాచారం ఆధారంగా హరీశ్ రావును విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు సిద్ధమైంది. నిజానికి, సిట్ నుంచి తనకు నోటీసులు అందుతాయని హరీశ్‌రావు గతంలోనే ప్రకటించారు. పంచాయతీ ఎన్నికల ముందు ఫార్ములా ఈ కారు రేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారని, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తనకు ఇస్తారని ముందుగానే అంచనా వేసి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరాన్నిబట్టి అధికారులు ట్యాపింగ్ చేస్తారని హరీశ్‌రావు గతంలో వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక, పలువురు అధికారులు, నాయకులను విచారించిన తర్వాత దర్యాప్తులో భాగంగా హరీశ్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ముందు నుంచీ కేసీఆర్ పేరు వినిపిస్తున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆయనకు కూడా నోటీసలు జారీ చేసి స్టేట్‌మెంట్ రికార్డు చేసే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# 2,500 మందితో వందేమాతరం ప్రదర్శన

150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2,500 మంది కళాకారులతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడం నిజంగా అద్భుతమని బండి సంజయ్ కొనియాడారు. సంగీతం, జాతీయ స్ఫూర్తి, ప్రతిష్ఠ అన్నీ కలగలిసిన ఈ కార్యక్రమం దేశానికి ఒక చారిత్రక నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగంగా, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రదర్శన జరగనుంది. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చిన 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననుండగా, దీనికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు. ఈ అరుదైన అవకాశంపై కీరవాణి కూడా స్పందించారు. "వందేమాతరం! చరిత్రాత్మక గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా, జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు సంగీతం సమకూర్చే గౌరవం నాకు దక్కింది. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశ స్ఫూర్తిని చాటే ఈ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలి" అని ఆయన తన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ అపురూప ఘట్టం కోసం దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఉగ్రవాదంపై చర్యలు తీసుకోవాలే కానీ, ఆజ్యం పోయకూడదు: పోలండ్ ఉపప్రధానికి జైశంకర్ చురక

**గత ఏడాది పాకిస్థాన్ వెళ్లి కశ్మీర్‌పై ఉమ్మడి ప్రకటన చేసిన పోలండ్ ఉప ప్రధాని**

**ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుందని జైశంకర్ విమర్శ**

**ఉగ్రవాదంపై మెతక వైఖరిని విడనాడాలని పిలుపు**

భారత్‌తో స్నేహ సంబంధాలు కోరుకునే దేశాలు ఉగ్రవాదంపై మెతక వైఖరిని విడనాడాలని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి రాడోస్లావ్ సికోర్స్కీతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది పాకిస్థాన్ పర్యటన సందర్భంగా రాడోస్లావ్ జమ్ము కశ్మీర్‌పై స్పందిస్తూ, కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని పాక్ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జైశంకర్ స్పందిస్తూ, ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుందని, కాబట్టి తమ దేశంతో స్నేహం కోరుకునే వారు ఉగ్రవాదంపై మెతక వైఖరిని ప్రదర్శించవద్దని కోరారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి రాడోస్లావ్‌కు తెలుసని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదానికి ఎవరూ ఆజ్యం పోయకూడదని జైశంకర్ హితవు పలికారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్-పోలండ్ మధ్య సంబంధాలు స్థిరంగా కొనసాగుతున్నాయని, వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

**పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నబీన్**

**జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో అనివార్యమైన ఎన్నిక**

**గత ఏడాది డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

# తెలంగాణ స్పీకర్‌కు సుప్రీం నోటీసులు

జారీ చేసింది. ఇదే అంశానికి సంబంధించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌తో మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను కలిపి విచారించాలని ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది. గత వారం ఇదే కేసుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు స్పీకర్ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం 10 మంది ఎమ్మెల్యేలలో చివరి ముగ్గురికి సంబంధించిన అనర్హత పిటిషన్లను స్పీకర్ ఇంకా తేల్చకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చివరి అవకాశమని స్పష్టం చేస్తూ, మిగిలిన పిటిషన్లపై రెండు వారాల్లో తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలని అల్టిమేటం జారీ చేసింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకునేందుకు ఎనిమిది వారాల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ కార్యాలయం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తదుపరి విచారణ నాటికి ఇప్పటివరకు జరిగిన పురోగతితో పాటు తీసుకోబోయే నిర్ణయాలపై పూర్తి నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఇరుపక్షాలు వాడీవేడిగా వాదనలు వినిపించాయి. బీఆర్ఎస్ నేతలు తమ పిటిషన్లలో ప్రతివాదులుగా పేర్కొన్న తెలంగాణ ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్ కార్యాలయం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అభిషేక్ మను సింఘ్వీ, నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. స్పీకర్ ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకోవడంతో పాటు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ మార్పు, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల కారణంగా విచారణలో జాప్యం జరిగిందని వారు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే కొన్ని అంశాలపై విచారణ పూర్తయిందని, మరికొన్నింటిపై తీర్పు రిజర్వ్ చేశామని తెలిపారు. అయితే, రెండు వారాల్లో పురోగతి కనిపిస్తే నాలుగు వారాల సమయం ఇస్తామని ధర్మాసనం స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది.

# మైసూరులో తెలంగాణ బంజారా నృత్యం ప్రదర్శన



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 19 : సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ మైసూరులో నిర్వహిస్తున్న బహు రూపీ నేషనల్ థియేటర్ ఫెస్టివల్ లో తెలంగాణ బంజారా నృత్యం తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుండి ప్రత్యేక వేషాదరణ కలిగిన లంబాడ నృత్యాన్ని గాయకుడు గంగాధర్ నాయక్ కల్చరల్ ఇన్చార్జిగా అక్కడి వేదికపై ఉర్రూతలు ఊగించిన బంజారా నృత్యం అక్కడి ప్రజల్ని అలరించాయి. ఈ యొక్క వేడుకలో జాతీయ యువజన అవార్డు గ్రహీత రేండ్ల కళింగ శాఖ ఒక్సి డిడియు జి కే వై ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ మమత మరియు ట్రైనింగ్ పొందిన బంజారా యువ కళాకారునిలు అలాగే ఇన్స్టుమెంట్ ప్లేయర్ వరాల వెంకన్న, ఇస్లావత్ నాగరాజు నాయక్, గాజుల రాజు గుంట మహేష్ తదితర కళాకారులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమానంతరం కర్ణాటక సాంస్కృతిక శాఖ సంచాలకురాలు గీత, రాష్ట్ర ప్రసిద్ధిగాంచిన కళాకారులు రాము అభినందించి మెమొంటో ప్రశంస పత్రంతో అభినందించారు. ప్రత్యేక వేషాదరణ కలిగిన మనవాళ్లను చూసి అక్కడివాళ్ళు ఎంతో ఆనందంతో ఫోటోలు దిగారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి, పలు ప్రసిద్ధిగాంచిన కళాకారుల నుండి ప్రత్యేక అభినందనలు తెలపడం జరిగింది.

## నారాయణపురంలో ఉచిత న్యాయ సలహా

# మరియు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తాం

### టి ఎస్ సి వి రాష్ట్ర అధ్యక్షుడు న్యాయవాది నర్రి స్వామి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశం నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి తెలంగాణ సామాజిక చైతన్యత రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, లాయర్స్ పోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హైకోర్టు ప్రముఖ నర్రి స్వామి కురుమ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఇప్పటికే ఉచిత న్యాయ సలహ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నము త్వరలో ఉచిత వైద్య సలహా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. భారతదేశం లో 90% గ్రామీణ ప్రాంత జనాభా ఉన్నది కాబట్టి అత్యంత ఖరీదైన మూడు వ్యవస్థలు విద్యావ్యవస్థ వైద్య వ్యవస్థ న్యాయవ్యవస్థని గ్రామీణ ప్రజలకు దగ్గర చేయడమే మా ప్రధాన ఎజెండా కాబట్టి తెలంగాణ సామాజిక నివేదిక ఆధ్వర్యంలో త్వరలో ఉచిత సలా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక వేదిక రాష్ట్రస్థాయి నేతలు కొల్ల మహేష్, దువ్వ నవీను, సముద్రం శ్రీనివాస్, సింగం కృష్ణ, ఈసం రామకృష్ణ, వెంకటరెడ్డి, పల్లె వెంకటరెడ్డి, అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు



## ముక్కాముల బేబీ సరోజిని దశదిన ఖర్మ

# కార్యాక్రమంలో పాల్గొన్న ప్రముఖులు..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని ముక్కాముల బేబీ సరోజిని ఇటీవల నిర్యాణం చెందారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ ఎస్టేట్ లో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికిశేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్ , బాలింగ్ యాదగిరి గౌడ్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు యలమంచి ఉదయ్ కిరణ్ ,వెంకటేశ్వరరావు, మహేందర్ ముదిరాజ్ , నాని, వంశీ, గోకినేపల్లి రమేష్, వినోద్, వినయ్ తదితరులు, అలాగే కుటుంబ సభ్యులు బాబ్జీ , వల్లభనేని సత్యనారాయణ , సుధీర్ బాబు కలిసి మియాపూర్ ఎస్ఆర్ ఎస్టేట్స్ ను సందర్శించి, పటానికి నివాళులు అర్పించారు. శోకతప్త కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అండగా నిలిచారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం, శాంతి, మనోబలాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ముక్కాముల బేబీ సరోజిని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# జానపద కళలకు జీవం పోస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, జనవరి 19 వార్త మిర్రర్ ప్రతినిధి:- గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ జానపద కళలను పరిరక్షించేందుకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముందడుగు వేశారు. ఆమనగల్ మండలం సింగంపల్లి గ్రామంలో ఇటీవల నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం నాటకానికి ఐక్యత ఫౌండేషన్ సభ్యుల ద్వారా రూ.25,000 ఆర్థిక సహాయాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు మాట్లాడుతూ.. గ్రామీణ జానపద కళలు మన సంస్కృతికి ప్రాణమని, రామాయణం వంటి బయలు నాటకాలు మన చరిత్రను, సంప్రదాయ విలువలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నేటి యువతకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంలో ఇలాంటి కళారూపాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ కళాకారులకు తగిన ప్రోత్సాహం లభిస్తే వారి ప్రతిభ మరింత వెలుగులోకి వస్తుందని, సంప్రదాయ కళలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాటక నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామీణ జానపద కళలను



ప్రోత్సహిస్తూ రూ.25 వేల ఆర్థిక సహాయం అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, గ్రామ మాజీ సర్పంచ్ నరసింహ, గ్రామస్తులు సత్తయ్య, విష్ణు, స్కైలాబ్, వెంకటయ్య, మల్లయ్య, లక్ష్మయ్య, జంగయ్య, యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా

# మహిళ స్వయం సహాయక సంఘాలకు 7 కోట్ల చెక్కుల పంపిణీ

మిర్యాలగూడ జనవరి 19:- (వార్త మిర్రర్) : మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్ర భారతిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో పట్టణ ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మహిళ స్వయం సహాయక సంఘాలకు సుమారు 7కోట్ల రూపాయల వడ్డీలేని ఋణాల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ పట్టణ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా పట్టణంలోని స్వయం సహకారక సంఘం మహిళలకు రెండోసారి ఇంతమందికి వడ్డీలేని రుణాలు అందించడం అందరి అన్నగా నాకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మహిళా ప్రభుత్వం, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500 గ్యాస్ సప్సిడీ, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇలా అనేక సంక్షేమాలు మహిళలను, ఆర్థికంగా కోటిష్వరులు చేసే విధంగా సామాజికంగా బలపరిచి వారు ఒక సమాజానికి దిక్సూచిగా తీర్చిధిద్దడం జరుగుతుందని అన్నారు. స్వయం సహాయ సంఘాల మహిళల కోరిన విధంగా వారి కోసం ఇందిరమ్మ మహిళా శక్తి పేరుతో మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని రెండేకరాల ప్రభుత్వ భూమిలో ఒక భవనాన్ని నిర్మిస్తామని అన్నారు. అదే విధంగా మిర్యాలగూడ బస్టాండ్ నీ అతిత్వరలో డిజిటల్ బస్టాండ్ గా తీర్చిదిద్దెందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా సన్నాహాలు చేస్తున్నామని సంబంధిత అధికారులకు కూడా వారు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఆర్టిసి బస్టాండ్ ఎదురుగానే ప్రభుత్వ స్థలంలో ఒక మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డిఎఒ శ్రీనివాస్ శర్మ, మున్సిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్, మెప్మా టిఎంసి పి.బక్కయ్య, మహిళా సమాఖ్యల ప్రతినిధులు అనిత, అధికారులు, పాల్గొన్నారు.



# పాఠశాలకు విద్యుత్తు బెల్ వితరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 19 : తాను విద్యనభ్యసించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు రాయికల్ లో ఆఫీస్ సభార్డినేట్ పోస్ట్ ఖాళీ గా ఉండడం తో బడి గంట మోగించడానికి పాఠశాల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఉపాధి కల్పన ప్రాంతీయ అధికారి బెజ్జారపు రవీందర్ పాఠశాలకు విద్యుత్ బెల్ ను అందించారు. పాఠశాల సమయసారిణి ఆధారంగా బడిగంట దానంతట అదే మొగుతుందని పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్ అన్నారు. పాఠశాల సిబ్బంది పి.రాజశేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, పి.రమేశ్, యం.డి రాజమహ్మద్, ఎ.పద్మ, జి.తరంగిణి, ఎ.రజిత, యస్.శోభ, తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీలో చేరిన పలువురు నాయకులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 19 : భారతదేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ఆదివాసిల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్థానిక ఆదివాసి దళిత హక్కుల తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు కురిసెంగ వేణు సోమవారం రోజున రాయికల్ పట్టణ అధ్యక్షులు కురుమ మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వం తీసుకోవడం జరిగింది. తోట మహేందర్ కూడా బిజెపి సభ్యత్వం తీసుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు ధర్మపురి సీనియర్ నాయకులు మచ్చ నారాయణ, ప్రధాన కార్యదర్శిలు కూనారపు భూమేష్, బన్న సంజీవ్, కడార్ల శ్రీనివాస్, అల్లే నరసయ్య, సామర్ల సతీష్, బోడుగం శ్రీకాంత్, శ్రీ గద్య సుమన్, వాసం నరసయ్య, సింగు నరేష్, సుండి గీకర్, రాము, తోపారపు ఆశాలు, కైరం సుదర్శన్, రామకృష్ణ, వాసం రమ, పల్లికొండ భీమ లింగం, అంది శంకర్, పరం కోసం వెంకటాద్రి, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పదాధికారులు పాల్గొన్నారు.



## జె.పినగర్‌లో ఘనంగా

# ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు.. పాల్గొన్న ప్రముఖులు

మియాపూర్ వార్త మిర్రర్ : తెలుగు వారి ఆరాధ్య దైవం, కారణ జన్ముడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, పద్మశ్రీ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 30 వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని జెపి నగర్ లో గల నందమూరి తారక రామారావు విగ్రహానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావిపాటి వెంకటేశ్వరరావు , జెపి నగర్ అధ్యక్షులు మోహన్ రావు , ఈశ్వర్ , దొప్పలపూడి రవి కృష్ణ , నాయుడు, అప్పారావు, శేషగిరి రావు, మరియు మియాపూర్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలతో కలిసి పాల్గొన్న సీనియర్ నాయకులు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ లు కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎం ఆర్ కె చౌదరి, దొప్పలపూడి వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము తదితరులు పాల్గొన్నారు.



## మియాపూర్‌లో

# ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు..

### పాల్గొన్న ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డిఎస్ఆర్కె ప్రసాద్, టీం సభ్యులు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ .. తెలుగు వారి గుండె చప్పుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, పద్మశ్రీ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మియాపూర్ హైటెన్షన్ లైన్ రోడ్ లో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి ప్రియతమ నాయకుడు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తో పాటు హైదర్ నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మియాపూర్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు ల తో కలిసి పాల్గొన్న సీనియర్ నాయకులు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్, లయన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహం కి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్, మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎం ఆర్ కె చౌదరి, దొప్పలపూడి వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము తదితరులు పాల్గొన్నారు.

# వి.ఎస్.ఆర్ జట్టు ప్రతిభకు ప్రశంసలు

## గెలుపోటములు సహజం సందీప్ కుమార్

కల్వకుర్తి, జనవరి 19 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఊర్కొండ మండల కేంద్రంలో గత మూడు రోజులుగా ఊర్కొండ ప్రీమియం లీగ్5 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ టోర్నమెంట్‌లో ద్వితీయ బహుమతి సాధించిన జెట్టుకు వి.ఎస్.ఆర్ జట్టుకు సందీప్ కుమార్ (మున్న) రూ.10,116 నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ, క్రీడల నిర్వహణ ద్వారా ఊర్కొండ మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న క్రీడా ప్రతిభను, మట్టిలో దాగి ఉన్న మాణిక్యాలను వెలికి తీయడం ఎంతో సంతోషకరమని అన్నారు. గెలుపోటములు క్రీడల్లో సహజమని, ఓటమితో నిరుత్సాహపడకుండా మరింత కృషి చేయాలని క్రీడాకారులకు సూచించారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన మేనేజ్‌మెంట్‌కు, క్రీడాకారులకు, గెలుపొందిన జట్లకు, గ్రామ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యకాల మంజుల శ్రీనివాసులు, ఉపసర్పంచ్ పోలె రాజు, వార్డు సభ్యులు, నవభారతి



డిఫెన్స్ జట్టు, ఎంఎస్ఎస్ వారియర్స్ జట్టు, వి.ఎస్.ఆర్ జట్టు, ఎన్.వై.ఎస్ జట్టు, జట్ల యజమానులు (ఒనర్స్), క్రీడాకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, జిల్లా, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు



## ప్రముఖ కవి యెన్నం రుక్మంగధరెడ్డి ఇకలేరు

### పార్థివ దేహానికి నివాళులర్పించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి, జనవరి 19 వార్త మిర్రర్ ప్రతినిధి:– వెల్దండ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు యెన్నం రుక్మంగధ రెడ్డి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న వెంటనే ఆయన వారి నివాసానికి చేరు కుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యెన్నం రుక్మంగధ రెడ్డి ఒక ఆదర్శ ఉపాధ్యాయుడిగా, సమాజానికి సాహిత్య సేవలందించిన గొప్ప కవిగా, రచయితగా ప్రజల మన్ననలు పొందారని గోలి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నాగుల్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీ చలిచీమల జ్యోతి నిరంజన్, మాజీ వెల్దండ మండల అధ్యక్షులు కానుగుల కన్యాకుమారి జోగయ్య , వార్డు సభ్యులు జంగిలి ఆనంద్, మాజీ ఎంపీటీసీ లింగం, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, కుడుముల శ్రీనివాస్ రెడ్డి, కొమ్ము నాగయ్య, జంగిలి ప్రవీణ్, మంగళగిరి సత్యం, పోలే అశోక్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ వర్ధంతి

దేవరకొండ జనవరి 19వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో మాజీ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది.సోమవారం నాడు అమరజీవి కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ 24వ వర్ధంతి సందర్భంగా వారి స్మారక స్తూపం వద్ద ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు ముఖ్య అతిధిగా హాజరై కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ అన్న స్మారక స్తూపం వద్ద వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు మాట్లాడుతూ........ అలుపెరుగని పోరాట యోధుడు కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ అని విద్యార్థుల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజిలేని అలుపెరుగని పోరాటం నిర్వహించిన వీరుడు కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ అన్నారు. దేవరకొండ ప్రాంతంలో విద్యార్థుల తలలో నాలుక లాగా నిరంతరం సమస్య ఎక్కడ ఉంటే బొడ్డుపల్లి శేఖర్ అక్కడ ఉండి పరిస్కారం అయ్యే వరకు రాజిలేని పోరాటం నిర్వహించాడని వారు కొనియాడారు. డిగ్రీ కళాశాలలో, ఇంటర్ కళాశాలలో అదనపు తరగతి గదుల కోసం, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ కోసం ,ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు సరైన భవనాలు లేక అరకొర వసతుల తోటి ఇబ్బందులు పడతా ఉంటే సొంత భవనాలు నిర్మించాలని,పురుగుల అన్నం తినలేక అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థుల కడుపునిండా నాణ్యమైన భోజనం పెట్టాలని,మెస్ ఛార్జీలు,కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, రైతులు,కార్మికులు సమస్యలను పరిష్కరించాలని అనేక సమస్యల మీద పోరాట నిర్వహించిన చరిత్ర కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ది అని,ఓర్వలేని మతోన్మాద గుండాలు హత్యను చేయడం ద్వారా ఉద్యమాలను ఆపాలని చూశారని కానీ శేఖర్ మరణం తర్వాత ప్రతి విద్యార్థుల గుండెల్లో నిలిచిపోయాడని, ఒక వీరుని బలిదానం వేల గొంతుల విప్లవ నినాదంగా మారుతుందని శేఖర్ మరణం ఎప్పటికీ వృధా కాదని ఆయన ఆశయ సాధన కోసం ఏఐఎస్ఎఫ్ సంఘం పునరంకితమై మరిన్ని



పోరాటాలు,మరింత ఉత్తేజంగా విద్యార్థుల కోసం ఉద్యమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి అర్జున్, డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, జిల్లా నాయకులు బాసవాడ శైలజ, ఎర్ర వినయ్, దేవరకొండ,నేరేడుగొమ్ము, పి. ఏ పల్లి మండల సమితి నాయకులు, వివిధ కళాశాలల అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భాను,ఏ సంతోష్,ఎలిమినేటి పుష్పలత,వి మణికంఠ,డి శివ,కే రామ్,ఎన్ వంశీ, చరణ్ తేజ్,కే బన్నీ,పి శ్రీకాంత్,సిద్దు, చరణ్, యస్వంత్,కే ధనలక్ష్మి,టీ పప్పీ,మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ దిమ్మెలు కూల్చాలన్న రేవంత్ వ్యాఖ్యలు సీఎం స్థాయికి తగదు

### ::: బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ముడిగశేఖర్ యాదవ్



కొండమల్లేపల్లి జనవరి 19 వార్త మిర్రర్ : తెలంగాణలో బిఆర్ ఎస్ దిమ్మెలు కూల్చాలన్న సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వాఖ్యలు సీఎం స్థాయికి తగదని రేవంత్ వ్యాఖ్యలు సీఎం స్థాయికి తగదని బిఆర్ఎస్ కొండమల్లేపల్లి పట్టణ యూత్ ప్రెసిడెంట్ ముడిగ శేఖర్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్టంలో బిఆర్ఎస్ గద్దెలను కులగొట్టాలని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం సీఎం స్థాయి కి తగదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ బిఆర్ ఎస్ దిమ్మెలను కూలగొట్టగలవేమో గాని ప్రజల గుండెల్లో ఉన్న గులాబీ జేండాను చెరుపలేవని హితవు పలికారు. చంద్రబాబుకు మీకు మధ్య సంబంధం మీ మాటల్లోనే అర్థం అయినదని, సీఎం రేవంత్ రెడ్డి వ్యవహార తీరును కేసీఆర్ పట్ల బీఆర్ఎస్ పార్టీ మీద చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గమనిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్టాన్ని తెచ్చినందుకా కెసిఆర్ ను బొందపెట్టాలా అని ప్రశ్నించారు. కెసిఆర్ ని బొందపెట్టడం కాదు కాదా దమ్ముంటే టచ్ చేసిచూస్తే కెసిఆర్ సత్తా ఏంటో రేవంత్ కు తెలుస్తుంది అని ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీ గౌరవాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించాలని ప్రతిపక్ష నాయకుడు ప్రతిపక్ష పార్టీ పట్ల మాట్లాడే తీరులో మార్పు చేసుకోవాలని కోరారు.

# డ్రైవర్ దృష్టి మెరుగైన దృష్టితో రోడ్డు భద్రతకు బాట

## వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో భారీ వాహన డ్రైవర్లకు నెలరోజుల పాటు ఉచిత కంటి పరీక్షలు






సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 19 : భారీ వాహన రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లలో ఉన్న దృష్టిలోపం కూడా ఒక ప్రధాన కారణమని గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు మరియు వాసన్ ఐ కేర్ వైద్యులు పేర్కొన్నారు. చాలా మంది డ్రైవర్లు అవగాహన లేక కంటి పరీక్షలు చేయించుకోరని, దాంతో తమకు దృష్టి సమస్యలు ఉన్న విషయమే తెలియకపోతుందని తెలిపారు.ఈ నేపథ్యంలో వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో “డ్రైవర్ దృష్టి మెరుగైన దృష్టి ద్వారా రోడ్డు భద్రత” అనే ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారీ వాహన డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తక్షణమే కళ్లద్దాలు అందజేయనున్నట్లు వాసన్ ఐ కేర్ ప్రతినిధులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న వాసన్ ఐ కేర్ సెంటర్లలో ఈ ఉచిత కంటి పరీక్ష సేవలు అందుబాటులో ఉండనున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగా సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద ఉన్న వాసన్ ఐ కేర్ సెంటర్‌లో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. భారతదేశంలోని ప్రముఖ కంటి సంరక్షణ సంస్థలలో ఒకటైన వాసన్ ఐ కేర్, డ్రైవర్లలో మెరుగైన దృష్టి, సురక్షిత డ్రైవింగ్ పద్ధతులు అలవర్చడమే లక్ష్యంగా ఈ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రచారం జనవరి 11 నుండి ఫిబ్రవరి 11 వరకు కొనసాగనుంది. క్రమం తప్పకుండా కంటి పరీక్షల ప్రాముఖ్యత, దృష్టి సమస్యలను ముందుగానే గుర్తించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో మంచి కంటి చూపు పాత్రపై డ్రైవర్లకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఈ శిబిరాల్లో నిపుణుల బృందం సమగ్ర కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. వాణిజ్య డ్రైవర్లలో సాధారణంగా కనిపించే వక్రీభవన లోపాలు, కంటిశుక్లం వంటి సమస్యలతో పాటు డ్రైవింగ్, రహదారి భద్రతపై ప్రభావం చూపే ఇతర కంటి సంబంధిత సమస్యలను కూడా గుర్తిస్తున్నారు. తదుపరి చికిత్స అవసరమైన వారిని సమీపంలోని వాసన్ ఐ కేర్ సెంటర్లకు పంపించి, అధునాతన వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

ఈ ప్రచారంలో భాగంగా పరిమిత స్లాట్లలో ఉచిత కంటిశుక్లం శస్త్రచికిత్సలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో ప్రీ–ఆపరేటివ్ పరీక్షలు మరియు అవసరమైన మందులు కూడా ఉంటాయని చెప్పారు. సురక్షిత డ్రైవింగ్‌కు మంచి దృష్టి అత్యంత కీలకమని, డ్రైవర్ దృష్టి ప్రచారం ద్వారా డ్రైవర్లలో అవగాహన పెంచి రోడ్డు ప్రమాదాల ప్రమాదాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని వాసన్ ఐ కేర్ ప్రతినిధులు తెలిపారు. నివారణ సంరక్షణ, అవగాహన కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న నాణ్యమైన కంటి సంరక్షణ సేవల ద్వారా సమాజంలో దృష్టి ఆరోగ్యాన్ని మెరుగుపరచేందుకు వాసన్ ఐ కేర్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఇర్షాద్ అహ్మద్, ఆశిష్, నేహా జైన్, ఆదిత్య, సురభి, గోపాలపురం ట్రాఫిక్ ఏఎస్ఐలు వాల్మీకి రాంబాబు, జాన్ బాబు, కానిస్టేబుల్ స్వరూప్‌తో పాటు వాసన్ ఐ కేర్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముచ్చలర్ల సత్తన్న 93వ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 19: తెలంగాణ తొలి తరం వాగ్గేయకారుడు, వైతాలీకుడు, ఉద్యమకారుడు ముచ్చర్ల సత్తన్న 93వ జయంతి కార్యక్రమం ఈ నెల రవీంద్ర భారతి వేదికగా నిర్వహించనున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఘనంగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ముచ్చర్ల సత్తన్న తెలంగాణ ఉద్యమానికి పాటల ద్వారా ప్రాణం పోసిన మహానుభావుడని తెలిపారు. ముచ్చర్ల గ్రామంలో జన్మించి, తన ఊరి పేరునే తన పేరుగా మార్చుకున్న గొప్ప ఉద్యమకారుడని గుర్తు చేశారు. 1959లో పంచాయితీ వ్యవస్థ అమలులోకి వచ్చిన తరువాత ముచ్చర్ల గ్రామ సర్పంచ్‌గా, రెండు సార్లు పంచాయితీ సమితి ప్రెసిడెంట్‌గా, హనుమకొండ సమితి ప్రెసిడెంట్‌గా సేవలందించారని తెలిపారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ నుంచి హనుమకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది, తన రాజకీయ గురువు హయగ్రీవ చారి పై 21,415 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని, 1983 నుంచి 1985 వరకు రవాణా శాఖ మంత్రిగా పనిచేశారని వివరించారు. 1952 నాన్ ముల్కి, ఇడ్లీసాంబార్ గో బ్యాక్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ముచ్చర్ల సత్తన్న, 1953లో స్టేట్ రీఆర్గనైజేషన్ కమిషన్ ముందు తెలంగాణకు జరగబోయే అన్యాయాన్ని ముందుగానే గ్రహించి “తెలంగాణ సోదరా తెలుసుకోరా, మోసపోకురా” అంటూ తన పాటలతో ఉద్యమాన్ని చైతన్యపరిచారని తెలిపారు. ముచ్చర్ల సత్యనారాయణ (సత్తన్న) సాహిత్యం, ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవీంద్ర భారతి లో నిర్వహించనున్న ఈ జయంతి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విద్యార్థులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దర్శనం జాన్, అందె కృష్ణ, రవి నాయక్, వంశీ, కొమ్మనబోయిన సైదులు, కృష్ణం రాజు, వినయ్, సాయి కృష్ణ, అంజన్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీలో ‘ఏఐ- ఆధారిత పరిశోధన’పై జాతీయ స్థాయి కార్యశాల

## ముఖ్య అతిథులుగా ఐబీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రముఖ పాత్రికేయులు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 19: విద్యా పరిశోధనా రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతో, ఉస్మానియా యూనివర్సిటీలోని సెంట్రల్ ఫెసిలిటీ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఓయూ అలుమ్ని అసోసియేషన్ సంయుక్తంగా “నేవిగేటింగ్ రీసెర్చ్ విత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్“ (చీుఙఱస్త్రఁఱఅస్త్ర =వంఝతీఎష్ట్ర ఙఱ్ష్ట్ర చాతీఱటఱఎఱఝశ్రీ ×త్వశ్రీశ్రీఱస్త్రవఅఎవ) అనే అంశంపై 10 రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. జనవరి 20 నుండి 31 వరకు జరిగే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు దాదాపు 400 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, యువ శాస్త్రవేత్తలు మరియు అధ్యాపకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

**రేపే ప్రారంభోత్సవం:**

ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జనవరి 20, 2026న మధ్యాహ్నం 2:00 గంటలకు PGRRCDE ఆడిటోరియంలో ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి అకడమిక్ మరియు పారిశ్రామిక రంగాల ప్రముఖులు హాజరుకానున్నారు:

ఈ పది రోజుల కార్యశాలకు ముఖ్య అతిథిగా ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం హాజరు కానున్నారు. గౌరవ అతిథిగా టైమ్స్ ఆఫ్ ఇండియా ఇన్వెస్టిగేషన్స్ ఎడిటర్, కృత్రిమ మేధ ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి పాల్గొంటారు. ఐబీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనురాధ కీలక ఉపన్యాసం చేయనున్నారు. పరిశోధన రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్( ఏఐ) ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో, ఈ వర్క్‌షాప్ ద్వారా పరిశోధకులకు అవసరమైన డిజిటల్ నైపుణ్యాలను అందించనున్నారు.

**ఏఐ-ఆధారిత పరిశోధనా పద్ధతులు:**

**శాస్త్రీయ మరియు సామాజిక పరిశోధనా ఫ్రేమ్‌వర్క్‌ను ఆధునీకరించడం.**

స్మార్ట్ అనలిటిక్స్: లిటరేచర్ రివ్యూ మరియు క్లిష్టమైన డేటా విశ్లేషణ కోసం అధునాతన ఏఐ పరికరాలను ఉపయోగించడంపై శిక్షణ ఇస్తారు. ఎథికల్ ఏఐ (ఎథికల్ ఏఐ): పరిశోధనల్లో ఏఐని బాధ్యతాయుతంగా వాడుతూ, ఒరిజినాలిటీని మరియు నైతిక విలువలను కాపాడటం. విద్యాపరమైన ఆవిష్కరణలలో ఉస్మానియా యూనివర్సిటీని అగ్రగామిగా నిలిపేందుకు ఈ కార్యక్రమం ఒక కీలక అడుగు అని ప్రొఫెసర్ ఇ. సుజాత (డైరెక్టర్, సి ఎఫ్ ఆర్ డి మరియు వర్క్‌షాప్ కన్వీనర్) పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతులు ప్రతిరోజూ మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పీజిఆర్ఆర్ సి డి ఈ వేదికగా జరుగుతాయని తెలిపారు.

# ఒంటరిగా ఉన్నామని ఎందుకు అనిపిస్తుంది? అందుకు మీ అలవాట్లే కారణమా?

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 19 : ఇటీవల కాలంలో చాలా మంది చుట్టూ జనాలు ఉన్నా కూడా 'ఒంటరిగా ఉన్నట్టు' అనుభూతి చెందుతున్నారు. కుటుంబం, స్నేహితులు, సోషల్ మీడియా.. అన్నీ ఉన్నప్పటికీ మనసులో ఖాళీగా, దూరంగా ఉన్న భావన కలుగుతోంది. అసలు ఈ ఒంటరితనం ఎందుకు వస్తుంది? నిజంగా మనం ఒంటరిగా ఉన్నామా? లేక మన అలవాట్లే ఇందుకు కారణమా? ఈ విషయాన్ని లోతుగా తెలుసుకుందాం.

**ఒంటరితనం అంటే ఏమిటి?**

ఒంటరితనం అనేది ఒంటరిగా ఉండటమే కాదు. మన భావాలు ఎవరికీ అర్థం కావట్లేదని అనిపించడం, మనకు నిజమైన అనుబంధం లేదని భావించడం, మనల్ని ఎవరు పట్టించుకోవట్లేదని అనిపించడం.. ఇవన్నీ ఒంటరితనానికి లక్షణాలు.

**మన అలవాట్లే ఒంటరితనానికి కారణమా?**

చాలా సందర్భాల్లో అవుననే చెప్పాలి. మనం తెలియకుండానే కొన్ని అలవాట్ల ద్వారా మనల్ని మనమే దూరం చేసుకుంటుంటాం.

**భావాలను దాచిపెట్టే అలవాటు**

"ఎవరికి చెప్పినా ఉపయోగం లేదు" అన్న భావనతో మన బాధలను లోపలే దాచుకుంటాం. ఇలా చేయడం వల్ల మనసులో భారంగా మారి, ఇతరులతో దూరం పెరుగుతుంది.

**ఇతరులతో పోల్చుకోవడం**

సోషల్ మీడియాలో కనిపించే "సంతోషం" నిజం కాదని తెలిసినా.. వాళ్ల జీవితం మనకంటే బాగుందని భావించడం. మన విలువను మనమే తగ్గించుకోవడం. ఇవి ఒంటరితనాన్ని మరింత పెంచుతాయి.

**అవసరం లేనంత ఒంటరిగా ఉండటం**

ఒంటరిగా ఉండటం కొంతవరకు మంచిదే. కానీ అదే అలవాటుగా మారితే.. మనం మనకే పరిమితమవుతాం. కొత్త అనుభవాలు, మనుషులు దూరమవుతారు.

**నమ్మకాన్ని కోల్పోవడం**

గత అనుభవాల వల్ల "ఎవ్వరూ నన్ను అర్థం చేసుకోరు", "అందరూ స్వార్థపరులే" అన్న భావన ఏర్పడితే, మనమే సంబంధాల నుంచి వెనక్కి వెళ్లిపోతాం.

**నేనే అన్నీ చూసుకుంటాను' అనే భావన**

సహాయం అడగడం బలహీనత కాదని తెలిసినా.. ఎవరినీ ఆశ్రయించకుండా అన్నీ మనమే చేయాలనుకోవడం, ఇది మనల్ని భావోద్వేగంగా ఒంటరిగా చేస్తుంది.

**ఒంటరితనాన్ని తగ్గించుకోవడానికి ఏమి చేయాలి?**

మీ భావాలను చెప్పడం నేర్చుకోండి. ఒక వ్యక్తితో అయినా సరే, మనసు విప్పి మాట్లాడడం చాలా అవసరం. పరిపూర్ణత కోసం కాకుండా, నిజమైన అనుబంధం కోసం చూడండి. ప్రతి సంబంధం పర్ఫెక్ట్‌గా ఉండాల్సిన అవసరం లేదు. మీతో మీరు స్నేహం చేసుకోండి. మీకు నచ్చిన పనులు చేయండి.. చదవడం, నడక, సంగీతం, ధ్యానం వంటివి. వర్చువల్ కనెక్షన్లకంటే, నిజమైన సంభాషణలు ఎక్కువ చేయండి. సహాయం అడగడంలో సంకోచించవద్దు. కౌన్సిలర్, స్నేహితుడు లేదా కుటుంబ సభ్యుడితో మాట్లాడటం మీకు మంచిది. ఒంటరితనం చెడు కాదుడ కానీ, ఒంటరితనం మనకు మనల్ని తెలుసుకునే అవకాశం ఇస్తుంది. కానీ, అది మనల్ని బాధపెట్టే స్థాయికి చేరితే, అది మార్పు అవసరమనే సంకేతం ఇస్తుంది. ఒంటరిగా ఉన్నామని అనిపించడం మన



తప్పు కాదు. కానీ ఆ భావనను కొనసాగించాలా? మార్చుకోవాలా? అనే నిర్ణయం మన చేతిలోనే ఉంటుంది. చిన్న అలవాట్లను మార్చుకుంటే, అనుబంధాలు పెరుగుతాయి. మనసు తేలికగా మారుతుంది. జీవితం మళ్లీ అర్థవంతంగా అనిపిస్తుంది. అందుకే ఒంటరితనం అనే భావనను మీ మనసులోంచి క్రమంగా తీసేయండి.

**(తిరుమల శంకర్)**

# వడ్డీ లేని రుణాలు పంపిణీ..

## మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య
## మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి






వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 19 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులని చేయాలని సంకల్పం తో చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని బి ఆర్ కె ఫంక్షన్ హాల్ లో చౌటుప్పల్ స్వయం సహాయక మహిళా సంఘాలచే సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో గత రెండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 591 మహిళ సంఘాలకు రూ.1,28,11,337/-(ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల పదకొండు వేల మూడు వందల ముప్పై ఏడు రూపాయలు) వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగింది.451సంఘాలకు గాను రూపాయలు 33,25,00,000/(ముప్పై మూడు కోట్ల ఇరవై ఐదు లక్షల రూపాయలు) వివిధ పథకాల ద్వారా వివిధ బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయడం జరిగిందని, మహిళలు ఋణాలు తీసుకొని స్వయం ఉపాధి ని ఏర్పాటు చేసుకోవాలని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చౌటుప్పల్ కమీషనర్ వెంకట్రాంరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో అతిథులుగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,కమిటీ వైస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి మున్సిపల్ మేనేజర్, డి.అంజయ్య ఆర్వో , హనుమాన్ ప్రసాద్,సానిటరీ ఇన్స్పెక్టర్, కవిత టీఎంసీ, ఆర్ పి లు, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వందలో కొన్నే కరిస్తాయ్ వీధి కుక్కలన్నింటిని ఎలా తప్పుబడతాం?

**ఒకటి రెండు ఘటనలతో మొత్తం కుక్కలనే నేరస్థులుగా చూడటం అన్యాయం**

**వీధి కుక్కల నిర్మూలన అమానవీయ చర్య: రేణు దేశాయ్**

**కుక్కలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు తలాతోక లేనివి**

**దోమకాటు, రోడ్డు ప్రమాదాల్లో మరణాలు పట్టవా?**

**మూగజీవాల ప్రాణాలూ విలువైనవే.. ప్రత్యేక షెల్టర్లు, మౌలిక వసతులు కల్పించాలి**

హైదరాబాద్, జనవరి 19 : వీధి కుక్కల సమస్యపై జరుగుతున్న చర్చలు మానవీయతను కోల్పోతున్నాయని సినీనటి, జంతు సంరక్షణ కేంద్ర నిర్వాహకురాలు రేణు దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. వంద కుక్కల్లో నాలుగైదే కరిస్తాయని, అలా అని మొత్తం వీధి కుక్కలన్నింటినీ నిర్మూలించాలనుకోవడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఏదో ఒక వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని అందరినీ శిక్షించలేం కదా? అలాగే ఒక్కో ఘటన ఆధారంగా లక్షలాది మూగజీవాల ఉనికినే ప్రశ్నించడమూ సరైంది కాదన్నారు. వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టులో ఇటీవల జరిగిన విచారణ సందర్భంగా వచ్చిన వ్యాఖ్యలు సహేతుకంగా లేవని ఆమె అభిప్రాయపడ్డారు. సమస్యను మూలంగా పరిష్కరించకుండా కేవలం నిర్మూలనపైనే దృష్టి పెట్టడం వల్ల పరిస్థితి మరింత తీవ్రమవుతుందన్నారు. కుక్కలను కాలభైరవుడిగా ఆరాధిస్తూ, మరోవైపు వాటిని చంపడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు.

తెలంగాణ, ఏపీలో ఇటీవల చోటుచేసుకున్న వీధి కుక్కల హత్యల నేపథ్యంలో 'తెలంగాణ జంతు పరిరక్షణ సంఘాల ఉమ్మడి కార్యాచరణ సమాఖ్య' ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రేణు దేశాయ్ భావోద్వేగంతో మాట్లాడారు. కుక్క కాట్లకన్నా దేశంలో దోమకాట్లు, రోడ్డు ప్రమాదాల వల్ల ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక లక్షల మంది మరణిస్తున్నారని, మద్యం మత్తులో వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలు తీస్తున్న ఘటనలపై మాత్రం అంతటి ఆగ్రహం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

కుక్కలు కరిస్తున్నాయన్న ఒక్క అంశంపైనే దృష్టి పెట్టకుండా, పరిష్కారాల గురించి ఆలోచించాలని ఆమె సూచించారు. ప్రమాదకరంగా ఉన్న కుక్కలపై సమాచారం ఉంటే జంతు సంరక్షణ సంస్థలకు లేదా జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీధి కుక్కల కోసం ప్రత్యేక షెల్టర్లు, వైద్యం, ఆహారం, స్టెరిలైజేషన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



ఈ సందర్భంగా సమావేశంలో ఓ వ్యక్తి జోక్యం చేసుకొని గ్రామాల్లో పిల్లలను కుక్కలు కరిస్తున్నాయని, అలాంటి కుక్కలను ఇంటికి తీసుకెళతారా? అంటూ ప్రశ్నించగా వాతావరణం ఉద్రిక్తంగా మారింది. దీనిపై స్పందించిన రేణు దేశాయ్ తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. ప్రతిరోజూ ప్రమాదానికి గురైన ఐదు నుంచి ఆరు కుక్కలకు చికిత్స అందిస్తున్నానని, ఇందుకోసం లక్షల్లో ఖర్చు చేస్తున్నానన్నారు. ఒక్క డిసెంబరులోనే 85కు పైగా కుక్కలను, వాటి పిల్లలను కాపాడినట్టు వివరించారు. వీధి కుక్కల తరఫున మాట్లాడుతున్న కారణంగా తన వ్యక్తిగత జీవితంపై సోషల్‌మీడియాలో దారుణంగా ట్రోలింగ్ జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'నీ బిడ్డకు కుక్క కరిస్తే అర్థమవుతుంది' అంటూ చేసే వ్యాఖ్యలు ఎంతవరకు మానవీయమని ప్రశ్నించారు. మూగజీవాల ప్రాణాలూ విలువైనవేనన్న విషయం సమాజం గుర్తించాలని కోరారు. సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఓ న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, అవి మానవీయ కోణంలో లేవని, వ్యక్తిగత అభిప్రాయాల్లా ఉన్నాయని రేణు దేశాయ్ వ్యాఖ్యానించారు. దేశంలో డబ్బు ఉన్నవారికే భద్రత ఉందని, సాధారణ ప్రజలకు రక్షణ లేదన్నారు. న్యాయవ్యవస్థ నుంచి పాలనా వ్యవస్థ వరకు అవినీతి విస్తరించిందని, ఇదే కారణంగా ఎంతో మంది దేశం విడిచిపోతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సినీ దర్శకుడు శశికిరణ్ తిక్క, జంతు పరిరక్షకురాలు ప్రవళిక, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వీధి కుక్కల హత్యలపై ఇప్పటికే కేసులు నమోదు చేసినట్టు స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.



# భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### ::: ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 19 : ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇరుగదిండ్ల అశోక్ అన్నారు.పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో నూతనంగా నిర్మించిన మోక్ష లింగేశ్వర స్వామి శివాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అడగగానే షెడ్డు నిర్మించేందుకు ముందుకు వచ్చిన ఇ ఎల్ వి ఫౌండేషన్ ను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ,ఇ ఎల్ వి ఫౌండేషన్ కేవలం ఆధ్యాత్మిక రంగంలోనే కాకుండా, విద్యా, వైద్య, ఉపాధి రంగాల్లో కూడా పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. దైవ కార్యాల్లో భాగస్వాములు కావడం వల్ల లభించే తృప్తి మరెక్కడా దొరకదన్నారు.

# నందనవనం స్మశాన వాటిక లో అసంపూర్తిగా మిగిలి ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి

### ::: కార్పొరేటర్ సుజాత నాయక్



ఎల్బీనగర్ 19 జనవరి : నందనవనం స్మశాన వాటికలో అసంపూర్తిగా ఉన్న పనులన్నిటిని త్వరలో పూర్తి అయ్యే విధంగా కాంట్రాక్టర్ ను ఆదేశించినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. సోమవారం స్మశాన వాటికలో పర్యటించి అందులో అసంపూర్తిగా ఉన్న పనులను పరిశీలించి నిధులు మంజూరైన పనులను త్వరలో కాంట్రాక్టర్ పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్ను ఆదేశించారు. గతంలో మంజూరైన నిధులు పూర్తి అయినందున మిగిలిపోయిన పనులకు గాను నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. అట్టి పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్మశాన వాటిక కమిటీ అధ్యక్షుడు మేడి యాదగిరి, దయ్యాల వెంకటేష్, సతీష్ గౌడ్,నరసింహా, జనార్ధన్, యాదయ్య, రేణుక గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో రథసప్తమికి
# విస్తృత ఏర్పాట్లు
## ఈ నెల 25న రథసప్తమి

**సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని వేడుకలు**

**ఏడు వేర్వేరు వాహనాలపై విహరించనున్న వేంకటేశ్వర స్వామి**

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక రథసప్తమి ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల జీవకోటికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఒకే రోజులో స్వామివారు ఏడు వేర్వేరు వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన ప్రత్యేకత. అందుకే రథసప్తమిని 'అర్ధ బ్రహ్మోత్సవం'గా కూడా పిలుస్తారు. ఉత్సవాలు తెల్లవారుజామున సూర్యోదయ వేళ సూర్యప్రభ వాహన సేవతో ప్రారంభమవుతాయి. అనంతరం చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం మీద స్వామివారు వరుసగా భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవతో ఈ మహోత్సవం ఘనంగా ముగుస్తుంది. ఒక్కరోజులోనే స్వామివారి ఏడు వాహన సేవలను దర్శించుకునే అరుదైన అవకాశం లభించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులు తిరుమలకు తరలిరానున్నారు.ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్శన క్యూలైన్లను సక్రమంగా నిర్వహించడం, తాగునీటి సరఫరా, అన్నప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రథసప్తమి వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.